శంభో శంకర.. హరోంహర

'శంభో శంకరా.. హర హర మహాదేవ' అంటూ భక్తులు ప్రణమిల్లారు. శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. కార్తీక మాస మూడో సోమవారాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీ పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. తమను చల్లగా చూడాలని వేడుకున్నారు.

- భక్తులతో పోటెత్తిన శివాలయాలు
- ఘనంగా కార్తీక మాస పూజలు
- దీపాలు వెలిగించిన మహిళలు


చాపాడు: ప్రత్యేక అలంకరణలో కేథారీశ్వరుడు


చాపాడు : మహిళల కోలాటం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రాంగణాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. శ్రీ అగస్త్యేశ్వరాయలంలో అగస్త్యమహాముని ప్రతిష్ఠించిన అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, రాజరాజేశ్వరి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రామేశ్వరంలోని శ్రీముక్తిరామ లింగేశ్వరాలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలు, వివిధ రకాల పండ్లతో అలంకరించారు. స్వామివారి ఉత్సవమూర్తిని దక్షిణామూర్తిగా అలంకరించారు. హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వయంగా స్వామికి అభిషేకాలు చేశారు. స్వామివారి మూలవిరాట్, కాశీఅన్నపూర్ణాదేవిలను విశేష అలంకరించారు. అలాగే అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకత లింగేశ్వరునికి గంగాజలంతో అభిషేకం చేశారు. ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలు, నవరత్నలింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. అన్ని ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తుల సందడి నెలకొంది. మహిళలు ఉదయం, సాయంత్రం వేళల్లో కార్తీక దీపాలను వెలిగించి తమను కాపాడాలని పరమశివున్ని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో హరికథ భాగవతార్ యడవల్లి రమణయ్య మహాశివునిపై హరికథ చెప్పారు.

భక్తి భావంతో కార్తీక పూజలు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో కార్తీక మాసం మూడో సోమవారం మహిళలు అత్యంత భక్తి భావంతో పూజలు నిర్వహించారు. ఆలయంలోని వీరభద్ర స్వామి, భద్రకాళీమాత, కేథారీశ్వరుడులను పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన మహిళల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో వేలాది మంది భక్తుల నడుమ వీరభద్రస్వామి, భద్రకాళీమాత ఉత్సవ విగ్రహమూర్తుల పల్లకి సేవ వైభవంగా జరిపారు. అన్నదాన సత్రాల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వైభవం.. శివపార్వతుల కల్యాణం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని రూపరాంపేట శివానందస్వామి శివాలయంలో మూడవ కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శివ పార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించిన కల్యాణ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. ముందుగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి ఊరేగింపుగా మేళతాళాలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు చైర్మన్ మడకల రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

బద్వేలు అర్బన్ : స్థానిక రూపరాంపేట శివానంద స్వామి ఆలయంలో నిర్వహించిన లక్షబిల్వార్చన, సహస్రదీపాలంకరణ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీకృష్ణదేవరాయనగర్‌లోని కాశీవిశ్వేశ్వర స్వామి శివాలయంలోని స్పటిక శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తెలుగుగంగ కాలనీలోని ఓంకారేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. చెన్నంపల్లె సమీపంలోని భవానీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, అనంతగిరి మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, వీరభద్రస్వామి ఆలయం, నాగులకట్టమీద శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక విద్యానగర్ సమీపంలోని శివరాజరాజేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివలింగానికి అన్నాభిషేకం నిర్వహించారు.

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి గ్రామ సమీపాన ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంతోపాటు నల్లగొండు లక్ష్మీనరసింహస్వామి ఆలయం, చెన్నకేశాపురంలో ఉన్న శ్రీదుర్గాంబదేవి ఆలయం, మేకవారిపల్లె శ్రీ అఖిలాండకోటి బ్రహ్మానంద ఆశ్రమంలో ఉన్న 108 శివలింగాలను దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో దీపాలను వెలిగించారు.

నాగనాథేశ్వరస్వామి ఆలయంలో..

ఖాజీపేట : మండలంలోని నాగనాథేశ్వరుని కొండ పైకి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చిరు. ఉదయం స్వామి వారికి పాలాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో అర్చన నిర్వహించారు. ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ద్విచక్ర వాహనాలు, ఆటోలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తీరింది. ఆంజనేయకొట్టాలు గ్రామస్తులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి అన్నదానం ప్రారంభించారు.


ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రత్యేక అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి


బద్వేలు అర్బన్: ఓంకారేశ్వరస్వామి ఆలయంలో..


బద్వేలు అర్బన్ : రూపరాంపేట శివానందస్వామి శివాలయంలో శివపార్వతుల కల్యాణం


ప్రొద్దుటూరు కల్చరల్ : అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో..

సీఎం జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం

అట్లూరు : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బద్వేలు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తంబళ్లగొంది సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్, మాడపూరు సచివాలయ పరిధిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్, ముత్తుకూరు సచివాలయ పరిధిలోని హెల్త్ క్లీనిక్‌లను డీసీ గోవిందరెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయాల భవనాలు జిల్లాలోనే బద్వేలు నియోజకవర్గంలో నిర్మాణాలు పూర్తి చేయడంతోపాటు ప్రారంభించడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి సగటున రూ.2.5 లక్షలు సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. ఇలాంటి పేదల పక్షపాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ముత్తుకూరులో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డితోపాటు స్థానిక నాయకులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షురాలు పొత్తపి రమాదేవి, అందూరు రామకృష్ణారెడ్డి, మణ్యం మల్లికార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాజోలు సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు చిరిపిరెడ్డి రమణమ్మ, నిర్మళ, మాజీ ఎంపీటీసీ పొన్నపోలు శ్యామలమ్మ, సర్పంచులు శ్యామల, ఆర్వీ సుబ్బారెడ్డి, నాయకులు పి.బ్రహ్మానందరెడ్డి, బుర్రి రాజా, వీరారెడ్డి, పెంచల్‌రెడ్డి, మల్లారెడ్డి, గంగిరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ నాగరాజు, ఎంపీడీఓ సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.


తంబళ్లగొంది సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలి

ప్రొద్దుటూరు క్రైం : భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రొద్దుటూరు న్యాయవాదులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. కోర్టు కాంప్లెక్స్ నుంచి శివాలయం సెంటర్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. భూ యాజమాన్య హక్కు చట్టం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయని ఈ సందర్భంగా న్యాయవాదులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబిద్‌హుస్సేన్, న్యాయవాదులు మార్తల సుధాకర్‌రెడ్డి, ముడిమేల కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జిలానిబాషా, ఆర్‌వీ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

చాపాడు : కంటి అద్దాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 46 మంది విద్యార్థులకు ఆప్తాలమిక్ ఆఫీసర్ తేజ ఆధ్వర్యంలో మండల వైద్యాధికారిచే కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదుకుంటున్న విద్యార్థులకు దృష్టి లోపం ఉండ కూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పరీక్షలు చేస్తోందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్నం భోజనంలో అందించే ఫుడ్ ద్వారా విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. వీటిలో పోషకార విలువలు ఉంటాయని వైద్యాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అన్నవరం హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

విద్యావిధానంలో సమూల మార్పులు

ప్రొద్దుటూరు : చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావిధానంలో సమూల మార్పులు చేసిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వూటుకూరు వీరయ్య ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు–నేడు అభివృద్ధి పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత 50 ఏళ్లగా చేయని పాఠశాల అభివృద్ధి పనులను నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిందన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమని ముఖ్యమంత్రి జగన్ గుర్తించారన్నారు. ఇందుకోసమే కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వం పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, మరో వైపు పేదలు తమ పిల్లలను పనులకు పంపకుండా ఉండేందుకు జగనన్న అమ్మ ఒడి ద్వారా రూ.15 వేలు అందిస్తున్నారన్నారు.


పాఠశాల అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

నియోజకవర్గానికి రూ.110 కోట్లు

మనబడి నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంబంధించి నియోజకవర్గానికి తమ ప్రభుత్వంలో రూ.110 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ పాఠశాలకు రూ.2 కోట్లు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా ఈ నెల 21న పాఠశాలను పునఃప్రారంభించాలని అనుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 86 పాఠశాలల్లో ఈ పనులు జరుగుతున్నాయన్నారు. వరదరాజులరెడ్డి స్వగ్రామమైన కామనూరులో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి పనులను తమ ప్రభుత్వంలోనే చేస్తున్నామన్నారు. పాఠశాల అభివృద్ధి పనులపై సమగ్రశిక్షా అభియాన్ పీఓ ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ అగ్గారపు శ్రీనివాసులు, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, కమాల్‌బాషా, ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగేశ్వరరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, మున్సిపల్ ఇంజనీర్ సాయికృష్ణ, ఏఈ ఉమ, ఎంఈఓ–2 శోభారాణి, ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ రాజు, ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

కలసపాడు : అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని మండల కేంద్రంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పప్పిరెడ్డి సీతారామిరెడ్డి, గురుస్వామి ఎద్దుల వెంకటరత్నంల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు గ్రామోత్సవం సాగింది. ఉదయం గణపతి పూజ, అయ్యప్ప స్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప కన్యస్వాముల కలశాలు, చిన్నారుల ప్రమిదలను చేత పట్టుకొని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శన, కోలాటం, చెక్కభజన, మంగుళూరు మహిళా బ్యాండ్ బృందం వాయిద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

స్థలాలు ఆక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని అమృతానగర్‌లో స్థలాలను ఆక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలు, పునాదులను ఇష్టానుసారంగా కబ్జా చేసి అమ్ముకుంటున్నారని ఆయన తెలిపారు. అనేక మంది తనకు ఫిర్యాదు చేశారన్నారు. సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. గతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చిన వారి ఆధార్ కార్డులు, ఇంటి పత్రాలను తహసీల్దార్‌కు అందించారు. సర్పంచ్‌తో పాటు సీపీఎం నాయకుడు సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

కలసపాడు : బడిని గుడిగా భావించి పాఠశాల అభివృద్ధికి దాతలు అందించిన సహకారం చాలా అభినందనీయమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని గంగాయపల్లె ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన విద్యావంతులు, యువకులైన ముట్టి చెన్నయ్య, ముట్టి చంద్రశేఖర్‌ల సహకారంతో సుమారు రూ.2 లక్షల అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలోని బడిని బాగు చేయాలనే తలంపుతో ముందుకు వచ్చి విద్యార్థులకు విలువైన ఆట వస్తువులు, నీటి సౌకర్యం, ప్రహరీగోడ, తరగతి గదులు, మరుగుదొడ్ల మరమ్మతులతోపాటు పాఠశాల గేటును ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా రంగులు వేయించడంతో పాటు వాల్ రైటింగ్స్ లాంటి అభివృద్ధి పనులు చేపట్టిన దాతల దాతృతం మరువలేనిదన్నారు.

మిచాంగ్ తుపాన్‌తో రైతుల్లో ఆందోళన

చాపాడు : మిచాంగ్ తుపాను ప్రభావంతో సోమవారం మధ్యాహ్నం నుంచి ఓ మోస్తరుగా వర్షం కురుస్తోంది. ఈక్రమంలో ఇప్పటికే నూర్పిళ్లు పూర్తియిన వరిధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ధాన్యం కుప్పలపై పట్టలను కప్పుకున్నారు. మరో రెండు రోజులు పాటు తుపాను ఉంటుందని వాతావరణ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వటంతో రైతులు తుపాను వర్షం పట్ల ఆందోళన చెందుతున్నారు.

ఎడతెరిపి లేని వాన

గోపవరం : మిచాంగ్ తుపాను ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తుంది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుంది. కాగా ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సరైన వర్షపాతం లేకపోవడంతో చెరువులు, కుంటలన్నీ వెలవెలబోతున్నాయి. మిచాంగ్ తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి కూడా వర్షం కొనసాగితే చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చే అవకాశం ఉంది.

ఘనంగా ఘంటసాల జయంతి

బద్వేలు అర్బన్ : ఘంటసాల గానం అజరామరమని ఘంటసాల లలిత కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సంగీత దర్శకుడు, గాయకుడు ఎస్.ఎస్.దావూద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని ఆయన కార్యాలయంలో ఘంటసాల జయంతిని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు సంగీత వినీలాకాశంలో ధృవతార పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు అని అన్నారు. సంగీతంపై తనకున్న మక్కువతో సంగీతాభ్యాసం చేసిన ఘంటసాల తెలుగు సంగీతం, పద్య గానానికి రూపకర్తగా నిలిచారన్నారు. అనంతరం విద్యార్థులతో ఘంటసాల పాటలు పాడించారు. కార్యక్రమంలో ఘంటసాల లలిత కళాపరిషత్ కోశాధికారి ఉమామహేశ్వరరావు, సభ్యులు గానుగపెంట నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపైనే ప్రభుత్వం దృష్టి


ప్రొద్దుటూరు : అభివృద్ధి, సంక్షేమంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె సచివాలయం –1 వద్ద సోమవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అనంతరం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండి ఆత్మకూరు సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, వాసంతి, వెంకటసుబ్బారెడ్డి, శ్రావణి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

14వ వార్డు పరిధిలో...

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డుకు సంబంధించి 16వ సచివాలయం వద్ద ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, కౌన్సిలర్ జిలాన్, మున్సిపల్ ఇంజనీర్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే పథకాలు

రాజుపాళెం : రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాం రెడ్డి తెలిపారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మండల పరిధి వెల్లాలలోని సచివాలయం వద్ద నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, గోపాయపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, రాజారాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లదిమ్ము భాస్కర్‌రెడ్డి, బీరం వెంకటరామిరెడ్డి, కానాల బలరామిరెడ్డి, రవి, సత్యబాబు, విజయ్, సుగుణపాల్, ఈఓపీఆర్డీ షాకీర్ ఆలీఖాన్, సచివాలయాల కన్వీనర్ వెలవలి శేఖర్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు : సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

దువ్వూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. మంలంలోని నీలాపురం గ్రామ సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాను పార్టీ నేతలతో కలసి ఆయన ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిరాకి బాషా, మూడిండ్లపల్లె, నీలాపురం గ్రామ సర్పంచ్‌లు రాజగోపాల్‌రెడ్డి, రామయ్య, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాయినేని భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సుబ్బరాయుడు, మూడుమాల శివశంకర్‌రెడ్డి, మహానందరెడ్డి పాల్గొన్నారు.


దువ్వూరు : వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి

సంక్షేమం కావాలంటే జగనే రావాలి

కాశినాయన : సంక్షేమం, అభివృద్ధి కొనసాగించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలని జేసీఎస్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి పేర్కొన్నారు. ఇటుగుల్లపాడు గ్రామ సచివాలయంలో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయ ఆవరణలో పార్టీ జెండాను, ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి పొందిన వివరాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మి, కన్వీనర్లు రమణారెడ్డి, శేషయ్య, కొండయ్య, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



క్లుప్తంగా

అన్నదానం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జమ్మలమడుగు బైపాస్‌రోడ్డులోని శ్రీ బ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో సోమవారం మందాది లోకేష్‌రెడ్డి అన్నదానం చేశారు. అనంతరం పండ్లు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమలో సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, ఆశ్రమ నిర్వాహకుడు పాలిచెర్ల సుబ్బరాయుడు, మేనేజర్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పత్రాల అందజేత

ప్రొద్దుటూరు : మండలంలోని కల్లూరు గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో 100 మందికి ప్రమాద బీమా పత్రాలను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అందించారు. జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి కల్లూరు గ్రామంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, యానిమేటర్లు, సచివాలయ ఉద్యోగులకు మొత్తం 100 మందికి సొంత నిధులతో ప్రమాద బీమా పాలసీ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదవశాత్తు ఎవరైనా చనిపోతే రూ.10 లక్షలు, సాధారణ మరణానికి రూ.2 లక్షలు బీమా కింద చెల్లిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివలక్ష్మి, ఉప సర్పంచ్ నరేంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పుల్లయ్య యాదవ్, జగన్ సైన్యం అధ్యక్షుడు భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా వినతులను పరిష్కరించాలి

గోపవరం : స్పందన వినతులను ఆయా శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి ఆయన స్పందనలో పాల్గొన్నారు. ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దారు దామోదర్ రెడ్డి, ఎంపీడీఓ సాయినాయక్, పశువైద్యాధికారి క్రిష్ణవేణి, వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఎంఈఓ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్ చేకూరుతుందని వేద వ్యాస డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో సోమవారం కాలేజ్ డే వేడుకలు నిర్వహించారు. చదువులో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్బయ్య, కోదండపాణి, మాదాసు మురళీ, నాగరాజు, యాసిన్, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

ప్రొద్దుటూరు క్రైం : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని టూటౌన్ సీఐ ఇబ్రహీం సూచించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లు, సమస్యాత్మక వ్యక్తులకు సోమవారం సాయంత్రం సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరితోనూ గొడవ పడరాదని చెప్పారు. ఎన్నికలు వస్తున్నందున రౌడీషీటర్లపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

వ్యాసరచన పోటీలు

పోరుమామిళ్ల : అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువతకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామిరెడ్డి పర్యవేక్షణలో 'సమాజ సేవ' అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి. వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని జూనియర్ కళాశాలలో నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

నేటి నుంచి సంకల్ప్ యాత్ర

గోపవరం : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో 5వ తేదీ మంగళవారం నుంచి 8వ తేదీ శుక్రవారం వరకు వీక్షిత్ సంకల్ప్ భారత్ యాత్ర నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాయినాయక్, ప్రత్యేధికాధికారి నాగరాజులు తెలిపారు.